నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, శనివారం 20 ఏప్రిల్ 2024 VIKARABAD

# మీ ప్రాంత బిడ్డను ఆశీర్వదించండి



ఆమనగల్లులో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విరాళం అందజేస్తున్న ఆర్ఎస్‌పీ సపోర్టర్స్ ఆర్గనైజర్ శ్రీధర్‌గోవింద్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ సురమల్ల సుభాశ్

**నాగర్‌కర్నూల్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

**రూ.17500 ఆత్మీయ విరాళం అందజేసిన ఆర్ఎస్‌పీ సపోర్టర్స్**

ఆమనగల్లు, ఏప్రిల్ 19 : మీ ప్రాంత బిడ్డనైన తనను లోక్‌సభ ఎన్నికల్లో ఆశీర్వదించాలని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆర్ఎస్‌పీ సపోర్టర్స్ ఆర్గనైజర్ , ప్రవాస భారతీయుడు శ్రీధర్ గోవింద్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్ ఖర్చుల నిమిత్తం 'ఒక్క రూపాయి ఆత్మీయ విరాళం' పేరిట క్రౌడ్ ఫండింగ్ సేకరించారు. దీనిద్వారా వచ్చిన రూ.17500 విరాళాన్ని నామినేషన్ వేసేందుకు వెళుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గ ఓటర్లు పార్టీలకు అతీతంగా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లాలయ్యగౌడ్, కొమ్ము శ్రీనివాస్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ సురమల్ల సుభాశ్, బండగల్ల చందు, మాజీ వార్డు సభ్యుడు జంతుక అల్లాజీ, నాయకులు రఘు, గండికోట శంకర్, కొమ్ము ప్రసాద్, విఠాయిపల్లి రమేశ్, ఏనుమల్ల రమేశ్, ప్రవీణ్, శంకర్, రాజు, మహేశ్, వరుణ్, రోహిత్, కిరణ్, సిద్ధు, రాజు, జగన్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

**జిల్లా వ్యవసాయాధికారి గోపాల్**



వికారాబాద్, ఏప్రిల్ 19 : విత్తనాల విక్రయాల్లో రైతులకు నకిలీ, లూజ్, గుర్తింపు పొందని పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ శుక్రవారం తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా అధీకృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొన్న తర్వాత రసీదును తీసుకోవాలని సూచించారు. పంట కాలం పూర్తి అయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు నకిలీ విత్తనాలను, ప్యాకెట్లలో కాకుండా లూజ్ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే దగ్గరలో ఉన్న మండల వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అట్టి అపరిచిత వ్యక్తుల వద్ద ఉన్న నిల్వను స్వాధీనం చేసుకోవడంతో పాటు, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఉపాధిలో మనమే మేటి

**పనులకు లక్షకుపైగా కూలీలు**





- రికార్డు స్థాయిలో హాజరు..రాష్ట్రంలోనే అత్యధికం
- ప్రస్తుతం ఉపాధి హామీ పనులకు రోజుకు 1,04,806 మంది కూలీలు హాజరు
- గత నెలతో పోలిస్తే 60 వేలకుపైగా పెరుగుదల
- వ్యవసాయ పనులు పూర్తి కావడంతో ఉపాధి పనులవైపు కూలీలు
- ఈనెలాఖరులోగా 1.30 లక్షలు దాటుతుందని అధికారుల అంచనా
- 15 రోజుల్లో కూలీలకు రూ.14.49 లక్షల చెల్లింపులు పూర్తి
- జిల్లావ్యాప్తంగా 1,83,309 జాబ్‌కార్డులు.. 3,77,087 మంది కూలీలు

వికారాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా జిల్లాలో ఉపాధి హామీ పనులకు ఏకంగా లక్ష మందికిపైగా కూలీలు హాజరవుతున్నారు. గత వారం రోజులుగా జిల్లాలో ప్రతి రోజూ లక్ష మందికి పైగా కూలీలు హాజరవుతుండడంతో కొత్త రికార్డు నమోదైంది. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో రైతులతోపాటు రోజువారీ కూలీలు కూడా అధిక సంఖ్యలో ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో కొంతమేర సాగైన వరి కోతలు కూడా ప్రారంభమైన దృష్ట్యా జిల్లాలోని రైతులు, కూలీలంతా ఉపాధి పనులవైపు మళ్లారు. మరో రెండు నెలలపాటు వ్యవసాయ పనులేమీ ఉండవు కాబట్టి ఊరూరా ఇంటిల్లిపాది ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. దీంతో జిల్లాలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నారు. కరోనా సమయంలో అత్యధికంగా 1.06 లక్షల మంది కూలీలు హాజరుకాగా, ఆ రికార్డును మించి ఉపాధి హామీ పనులకు కూలీలు హాజరయ్యేలా జిల్లా ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటూ ప్రతి నిత్యం ఉపాధి హామీ పనులపై సమీక్ష చేస్తున్నారు. గురువారం వికారాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పనులకుగాను అత్యధిక సంఖ్యలో కూలీలు హాజరయ్యారు. గత నెలతో పోలిస్తే ఈనెలలో ఉపాధి పనులకు హాజరయ్యేవారు భారీగా పెరగడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా గత నెలలో జిల్లాలో రోజుకు 40 వేల వరకు కూలీలు ఈ పనులకు హాజరుకాగా, ప్రస్తుతం హాజరయ్యే కూలీల సంఖ్య రోజుకు 1,04,806 మందికి పెరిగింది. ఈనెలాఖరులోగా పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య 1.30 లక్షలు దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 59.85 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు, గతేడాదితో పోలిస్తే పనిదినాల సంఖ్యను 3 లక్షల వరకు తగ్గించడం గమనార్హం. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు రోజుకు రూ.300 కూలీ డబ్బులను అందజేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదలైన పదిహేను రోజుల్లో కూలీలకు రూ.14.49 లక్షల కూలీ డబ్బులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేశారు. జిల్లావ్యాప్తంగా 1,83,309 జాబ్‌కార్డులుండగా 3,77,087 మంది కూలీలు ఉన్నారు.

## ఈనెలాఖరులోగా 1.30 లక్షలు దాటేలా చర్యలు



జిల్లాలో ఉపాధి హామీ పనులకు రికార్డు స్థాయిలో కూలీలు హాజరవుతున్నారు. ఈనెలాఖరులోగా 1.30 లక్షల మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాం. ఉపాధి హామీ పనుల్లో చేసిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని ఆదేశించాం. ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం 12 గంటల్లోపు ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించాం.

– వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

### 1.04 లక్షల మందికి పెరిగిన కూలీలు..

జిల్లాలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. గత నెలతో పోలిస్తే ఈ నెలలో 60 వేలకు పైగా కూలీలు పెరిగారు. జిల్లాలో 566 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ఎక్కువగా పెద్దేముల్ మండలంతోపాటు మర్పల్లి, ధారూరు, కులకచర్ల, కోట్‌పల్లి మండలాల్లో పనులకు అధికంగా హాజరవుతున్నారు. మరోవైపు జిల్లాలో హరితహారంతోపాటు ఇంకుడు గుంతల నిర్మాణం, నీటిఊట గుంతల నిర్మాణం, మట్టి రోడ్ల నిర్మాణం పనులను ప్రధానంగా చేస్తున్నారు. పొలాలకు రోడ్లు వేయడం, ముళ్ల పొదలు తొలగించడం, అసైన్డ్ భూముల్లోని రాళ్లను తీసివేయడం, భూమిని చదునుచేయడం, బౌండ్రీలు ఏర్పాటు చేయడం, ఎరువు గుంతల నిర్మాణం, బోరుబావి తవ్వించడం తదితర పనులు అసైన్డ్ భూముల్లో చేపట్టనున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, మట్టి కట్టలు, నీటి ఊట గుంతలు, పశువులకు షెడ్ల ఏర్పాటు, భూ ఉపరితల నీటి గుంతల నిర్మాణం, పంట కాలువల మరమ్మతులు, పంట మార్పిడి కల్లాలు, కొత్త సేద్యపు బావులు తవ్వడం, నిరవధిక సమతల కందకాలు, ఖండిత సమతల కందకాలు, కొండ దిగువ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు, పశువుల నిరోధక కందకాలు, భూసార సంరక్ష కందకాలు, కొత్త పంట కాలువల నిర్మాణం, మైనర్ ఇరిగేషన్ కాలువలో పూడికతీత, చేపల ఉత్పత్తి కుంటల నిర్మాణం, వరద కట్టల నిర్మాణం పనులను చేస్తున్నారు.

# పోలింగ్‌కు సన్నద్ధం

- చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో 3,595 ఈవీఎంల వినియోగం
- ఇప్పటికే మొదటి విడుత ర్యాండమైజేషన్ పూర్తి
- ఎన్నికల విధుల్లో 13,443 మంది పీవో, ఏపీవో, ఓపీవోలు
- ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు
- జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న ఎన్నికల ఏర్పాట్లు

రంగారెడ్డి, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): లోక్ సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండడంతో అధికారయంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేసింది. ముఖ్యంగా ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది నియామకం, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ తదితర వాటిపై ఎన్నికల అధికారులు దృష్టి పెట్టారు. చేవెళ్ల పార్లమెంటుకు నిర్వహిస్తున్న ఎన్నికల్లో మొత్తం 3,595 ఈవీఎంలను వినియోగిస్తున్నారు. మరికొన్నింటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఎన్నికల విధుల్లో పీవో, ఏపీవో, ఓపీవోలు మొత్తం 13,443 మంది పాల్గొంటున్నారు. వీరితోపాటు అత్యవసర సేవలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు ఎన్నికల విధులను నిర్వర్తించనున్నారు. వీరందరూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకునేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

**మొదటి విడుత ర్యాండమైజేషన్ పూర్తి..**

పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలపై అధికారులు దృష్టి సారించారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో 3,595 కంట్రోల్ యూనిట్లను, మరో 3,595 బ్యాలెట్ యూనిట్లు, 4,028 వీవీ ప్యాట్లను వినియోగిస్తున్నారు. పోలింగ్ సమయంలో యంత్రాలు పనిచేయకపోతే ఇబ్బంది ఉండకుండా ఉండేందుకు అదనంగా మరిన్ని కంట్రోల్ యూనిట్లను తెప్పించి గోదాంలలో భద్రపర్చారు. వీటన్నింటికీ మొదటి స్థాయి తనిఖీని పూర్తి చేశారు. త్వరలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండో స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారు.

ఈడీసీ(ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్)ద్వారా అక్కడే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. ఒక లోక్ సభ నియోజకవర్గం వారు మరో లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వర్తించాల్సి వస్తే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఫారం–12 ద్వారా దరఖాస్తు చేసుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పొందాల్సి ఉంటుంది. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులతోపాటు పోలీస్ శాఖ, అత్యవసర సేవల విభాగాల్లో పనిచేసే విద్యుత్తు, వైద్య, రవాణా, అగ్నిమాపక, రైల్వే, రేడియో, మీడియా తదితర విభాగాల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను పొంది తాము విధులు నిర్వర్తించే ప్రాంతానికి సమీపంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. వీరితో పాటు 85 ఏండ్లు దాటిన వయోవృద్ధులు, వికలాంగులకు సైతం 12–డీ ఫాం ద్వారా పోస్టల్ బ్యాలెట్ పొంది ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను మే 3వ తేదీ నుంచి ప్రారంభించి 8 లోపుగా పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్ల వివరాలు..**


| నియోజకవర్గం | పోలింగ్ స్టేషన్లు | సీయూఎస్ | బీయూఎస్ | వీవీ ప్యాట్స్ |
|---|---|---|---|---|
| మహేశ్వరం | 537 | 671 | 671 | 752 |
| రాజేంద్రనగర్ | 543 | 679 | 679 | 760 |
| శేరిలింగంపల్లి | 633 | 791 | 791 | 886 |
| చేవెళ్ల | 298 | 372 | 372 | 417 |
| పరిగి | 305 | 381 | 381 | 427 |
| వికారాబాద్ | 284 | 355 | 355 | 398 |
| తాండూరు | 277 | 346 | 346 | 388 |

### కేంద్రానికి ఐదుగురు సిబ్బంది..

ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్(పీవో), ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్(ఏపీవో), ముగ్గురు సహాయక ప్రిసైడింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. ఈ లెక్కన మొత్తం 13,443 మంది ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహిస్తారు. అదనంగా మరో 20 శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతున్నారు. పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ కోసం 259మంది సెక్టోరల్ అధికారులను నియమించారు. ఇంకా కొంత మందిని ఎన్నికల విధులకు వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు శాఖలకు చెందిన ఉద్యోగుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఎన్నికల సిబ్బందికి విడుతలవారీగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

### విధులెక్కడో.. ఓటు అక్కడే..

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది అంతా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటు కలిగి ఉండి అదే నియోజకవర్గం పరిధిలో మరోచోట విధులు నిర్వహిస్తున్న వారికి



# గరుడ ప్రసాదం భక్తజనసంద్రం



గరుడ ప్రసాదం కోసం చిలుకూరు బాలాజీకి బారులు తీరిన భక్తులు

మొయినాబాద్, ఏప్రిల్19: చిలుకూరు బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం ధ్వజారోహణం అనంతరం గరుడ ప్రసాదం వితరణ చేశారు. ఈ ఏడాది ఊహించని రీతిలో భక్తులు వచ్చారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సుమారుగా లక్ష మంది వరకు వచ్చారు. భక్తులు కొందరు గురువారం సాయంత్రం ఆలయానికి చేరుకుని అద్దె రూముల్లో ఉన్నారు. చాలా మంది శుక్రవారం ఉదయం 3 గంటల నుంచి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు గరుత్మంతునికి పూజలు చేసి ధ్వజారోహణము పూర్తి చేసిన తరువాత ఉదయం 8.30 గంటలకు గరుడ ప్రసాదం వితరణ ప్రారంభించారు. ధ్వజారోహణ కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, పరావస్తు రామాచారి, తిరుమల కిరణాచారి, నర్సింహచారి, కిట్టు స్వామి, కన్నయ్యస్వామి, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

### సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం..

గరుడ ప్రసాదం స్వీకరించడం వలన సంతాన ప్రాప్తి కలుగుతుందని ఆలయ అర్చకులు మాట్లాడిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం ఆరు గంటల తరువాత రద్దీ పెరిగింది. దూరం నుంచి గరుడ ప్రసాదం కోసం వచ్చిన కొందరికి గరుడ ప్రసాదం అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. దాదాపు 30 వేల మంది మహిళలకు గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత గరుడ ప్రసాదం అయిపోయిందని అర్చకులు చెప్పడంతో మహిళలు వెనుదిరిగారు.



గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న ఆలయ అర్చకులు సీఎస్ రంగరాజన్

### ఒక్కరోజులోనే ప్రసాదం అయిపోయింది..

అనుకున్నదానికంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు గరుడ ప్రసాదం కోసం వచ్చారు. సాధారణంగా ప్రతి ఏడాది గరుడ ప్రసాదం మూడు రోజుల వరకు ఇచ్చే ఆనవాయితి ఉండేది. కానీ ఈ ఏడాది ఒక్క రోజుతోనే గరుడ ప్రసాద వితరణ పూర్తయ్యింది. తరువాత గరుడ ప్రసాదం ఇచ్చే అవకాశం లేదు.

– సీఎస్ రంగరాజన్, ఆలయ అర్చకులు

### మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ క్లియర్ చేశాం..

గరుడ ప్రసాదం కోసం భక్తులు వస్తారని, బందోబస్తు కల్పించాలని సమాచారం ఇచ్చారు. సుమారుగా 4 నుంచి 5 వేల మంది భక్తులు వస్తారని చెప్పారు. కానీ ఊహించని రీతిలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో ఉదయం నుంచి ట్రాఫిక్ జామ్ అవుతూ వచ్చింది. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

– పవన్‌కుమార్‌రెడ్డి, సీఐ మొయినాబాద్

# రెండో రోజు మూడు నామినేషన్లు

**చేవెళ్ల లోక్ సభకు గడచిన రెండు రోజుల్లో మొత్తం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు**



చేవెళ్ల లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ తరపున శుక్రవారం కలెక్టర్ శశాంకకు నామినేషన్‌ను దాఖలు చేస్తున్న ఆయన కుమారుడు కాసాని వీరేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల భిక్షపతి, జీ నాగేందర్‌గౌడ్, చిన్నంగి వెంకటేశం

రంగారెడ్డి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : నామినేషన్ల ప్రక్రియలో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి రెండో రోజు శుక్రవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎంసీపీఐ(యూ)పార్టీ అభ్యర్థిగా వనం సుధాకర్, ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థిగా ముహ్మద్ చాంద్ పాషా, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరపున ప్రతిపాదకులు మేకల భిక్షపతిలు నామినేషన్లను ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంకకు అందజేశారు. గత రెండు రోజుల్లో చేవెళ్ల స్థానానికి మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ తెలిపారు.

